

తగ్గిన ఆదాయం
పడిపోయిన రిజిస్ట్రేషన్‌లు

- కుదేలైన రియల్ వ్యాపారం
- ఉమ్మడి జిల్లాలో గతంలో నెలకు సగటున రూ.20 కోట్ల నుంచి 22 కోట్ల ఆదాయం
- ఏప్రిల్‌లో వచ్చింది రూ.14.71 కోట్లు
- భూముల మార్కెట్ విలువలు పెంచుతారన్న ప్రచారంతో మే, జూన్‌లలో కొంత ఊరట
- మూడు నెలల్లో వచ్చింది రూ.54 కోట్లు



క్రయ విక్రయదారులు లేక బోసిపోయిన మహబూబ్‌నగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

మహబూబ్‌నగర్, జూలై 26: ప్రభుత్వానికి ఆదాయం ఇచ్చే వనరుల్లో రిజిస్ట్రేషన్‌ల రూపంలో వచ్చే ఆదాయం ఒకటి. కొన్ని నెలలుగా రియల్ వ్యాపారం కుదేలైంది. క్రయవిక్రయాలలో జోరుతగ్గింది. ఈ ఆర్థిక సంవత్సరం గడిచిన మూడు నెలలు గతంతో పోలిస్తే ఆదాయం తగ్గిపోయింది. ఉమ్మడి పాలమూరులో ఈ శాఖ ద్వారా సగటున నెలకు రూ. 20 కోట్ల నుంచి 22 కోట్ల ఆదాయం సమకూరేది. ఈ ఆర్థిక సంవత్సరం మూడునెలల్లో సగటున రూ.18 కోట్ల ఆదాయం మాత్రమే సమకూరింది. ఏప్రిల్‌లో పూర్తిగా పడిపోయింది. భూముల మార్కెట్ విలువ పెంచనున్నట్లు ప్రచారం జరగడంతో మే, జూన్ నెలల్లో కొంత జోరందుకున్నది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 13 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా అందులో జడ్చర్ల, మహబూబ్‌నగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలలోనే సగం వరకు ఆదాయం రావడం గమనార్హం. అయితే తాజాగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రిజిస్ట్రేషన్ ఆదాయం గతంలోకంటే పెంచుకోవాలని నిర్ణయించడంతో భూముల మార్కెట్ విలువలను తొందరలోనే పెంచనున్నారన్న విషయం స్పష్టమవుతోంది. ఎందుకంటే కొన్నినెలలుగా రియల్ వ్యాపారం మందకోడిగా సాగుతోంది. ఇలానే కొనసాగితే గతంలో వచ్చిన ఆదాయం కన్నా తగ్గే అవకాశం ఉంది. అయినా ప్రభుత్వం బడ్జెట్‌లో ఆదాయం ఎక్కువగా చూయించడంతో రిజిస్ట్రేషన్, స్టాంప్‌డ్యూటీ ఫీజులు పెరగనున్నాయని అర్థమవుతోంది. ముందుగా ఆగస్టు 1 నుంచే పెంచుతామని భావించినా ఇప్పటివరకు పెంపుపై ఎలాంటి మార్గదర్శకాలు విడుదల కాకపోవడంతో 1వ తేదీ నుంచి పెంపు సాధ్యం కాకపోవచ్చని తెలుస్తోంది.

ఏప్రిల్‌లో ఢమాల్

ఆర్థిక సంవత్సరం మొదలైన ఏప్రిల్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మార్కెట్ ఢల్‌గా సాగింది. దీంతో రూ.6-7 కోట్ల ఆదాయం ఒక్క నెలలో తగ్గిపోయింది. ఈ నెలలో కేవలం రూ.14.71 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది. అందులో జడ్చర్ల సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో రూ.3.50 కోట్లు, మహబూబ్‌నగర్‌లో రూ.2.91 కోట్ల ఆదాయం వచ్చింది. అంటే ఈ రెండింటిలో దాదాపు 43 శాతం ఆదాయం ఈ రెండు ప్రాంతాలలో రాగా, మిగతా చోట వ్యాపారం అంతంత మాత్రంగానే ఉన్నదన్న విషయం తెలుస్తోంది. గద్వాలలో 1.84 కోట్లు, వనపర్తిలో 1.80 కోట్ల ఆదాయం వచ్చింది. మే, జూన్‌లో మార్కెట్ విలువ పెంచుతున్నారన్న ప్రచారంతో కాస్త రిజిస్ట్రేషన్‌లు జోరందుకున్నాయి. మే నెలలో రూ.19 కోట్ల ఆదాయం రాగా, జూన్‌లో రూ.21 కోట్ల ఆదాయం సమకూరింది. 2022-23 సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలోని 13 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా ప్రభుత్వానికి రూ.244.49 కోట్ల ఆదాయం రాగా, 2023-24 సంవత్సరంలో రూ.250.05 కోట్ల ఆదాయం లభించింది. ఈ ఏడాది అంతకన్నా ఎక్కువ ఆదాయాన్ని రాబట్టుకోవాలని ప్రభుత్వం చూస్తున్నా లక్ష్యాన్ని అందుకునే పరిస్థితులు లేవని తెలుస్తోంది.

మార్కెట్ విలువ పెంచితే

ఇప్పటికే అంతంత మాత్రంగా ఉన్న రియల్ వ్యాపారం మార్కెట్ విలువ పెంచితే మరింత ఆదాయం తగ్గే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రియల్ వ్యాపారం బాగా సాగితే భూముల క్రయవిక్రయాలు పెరుగుతాయి. భూములు, ప్లాట్లు కొనుగోలు చేసేవాళ్ల ఒకచోట భూమి, ప్లాటు కొనుగోలు చేసి కాస్త రేటు వస్తే వెంటనే మళ్లీ అమ్ముకుంటారు. ఇలా వ్యాపారం చేసేవాళ్ల చాలామంది ఉంటారు. దీంతో క్రయవిక్రయాలు ఎక్కువగా జరగడం వల్ల రిజిస్ట్రేషన్‌లు ఎక్కువగా జరిగి ఆదాయం పెరుగుతుంది. అదే భూములు, ప్లాట్లకు డిమాండ్ తగ్గి రియల్ వ్యాపారం పడిపోతే క్రయవిక్రయాలు తగ్గిపోయి తద్వారా రిజిస్ట్రేషన్‌లు చేసుకునే వారి సంఖ్య తగ్గుతుంది. ఇక మార్కెట్ విలువలు పెరిగితే రిజిస్ట్రేషన్ చేసుకునే దాన్ని కన్నా అగ్రిమెంట్‌లు చేసుకునే వారి సంఖ్య పెరుగుతుంది. దీంతో రిజిస్ట్రేషన్ ఆదాయం తగ్గిపోతుంది. మరోవైపు రియల్ వ్యాపారులు చాలా రోజులనుంచి గ్రామపంచాయతీ లే అవుట్లపై ఉన్న నిషేధం ఎత్తివేయాలని కోరుతున్నారు. గత ప్రభుత్వం నాలుగేళ్లక్రితం గ్రామపంచాయతీ లే అవుట్ల రిజిస్ట్రేషన్‌లపై నిషేధం విధించింది. దీంతో అప్పటివరకు గ్రామపంచాయతీ లేఅవుట్లపై పెద్దఎత్తున పెట్టుబడి పెట్టి లేఅవుట్ చేసిన వాళ్లంతా పరేషాన్‌లో పడ్డారు. ఈ ప్రభావం కూడా రిజిస్ట్రేషన్ ఆదాయంపై పడుతోంది. ప్రభుత్వం జీపీ లే అవుట్లకు అనుమతిస్తే పెద్దఎత్తున రిజిస్ట్రేషన్‌లు జరిగి ఆదాయం సమకూరే అవకాశం ఉంది.


నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు జీఎంఆర్, పర్ణికారెడ్డి

ప్రతీ ఎకరాకు సాగునీరు

- ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర, జూలై 26 : ప్రతీ ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వం లక్ష్యమని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డితో కలిసి పూజలు చేసి కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. ముందుగా కోయిల్‌సాగర్ ప్రాజెక్టు వద్ద నాయకులు ఎమ్మెల్యేలకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్టులోకి జూరాల నీరు వచ్చి చేరడంతో వానాకాలం పంటకు నీటిని విడుదల చేశామని తెలిపారు. మరో రెండు రోజుల్లో జూరాల నుంచి నీటిని విడుదల చేసి ప్రాజెక్టును పూర్తి స్థాయిలో నింపుతామన్నారు. 10 రోజుల వరకు నీటిని విడుదల చేస్తామని తెలిపారు. కుడి, ఎడమ కాల్వల ద్వారా 250 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, మండల నాయకులు, ప్రాజెక్టు ఈఈ ప్రతాప్‌సింగ్, అధికారులు పాల్గొన్నారు.



సంగమేశ్వరుడు కృష్ణమ్మ ఒడిలోకి చేరుకుంటున్న వేళ.. ఆలయ శిఖరం అంచుల వరకు నీరు చేరిన సమయం.. సంధ్యవేళ ప్రకృతి పులకరించింది. నీలాకాశానికి కొత్త రంగులు అద్దింది. అస్తమిస్తున్న సూర్యుడి ప్రతిబింబం నదిలో తళుక్కుమంటోంది. ఈ అపురూప దృశ్యం శుక్రవారం సాయంత్రం కొల్లాపూర్ మండలం సోమశిల వద్ద కృష్ణానది అవతలి ఒడ్డున కనిపించింది. ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' కెమెరా క్లిక్ మనిపించింది.

- కొల్లాపూర్

రైతు కుటుంబం నుంచి..
ఉత్తమ పార్లమెంటేరియన్ దాకా



- సూదిని జైపాల్‌రెడ్డి 50 ఏళ్ల రాజకీయ ప్రస్థానం
- ఐదు సార్లు ఎంపీగా, నాలుగు మార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రికార్డు
- స్పష్టమైన ఉచ్చారణ, వాగ్ధాటితో అందరినీ ఆకర్షించిన సూదిని
- రేపు ముఖ్యమంత్రి చేతుల మీదుగా జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ

నాగర్‌కర్నూల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఆత్మస్థైర్యం ఉంటే వైకల్యాన్ని అధిగమించి ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని సూదిని జైపాల్‌రెడ్డి నిరూపించారు. మధ్య తరగతి రైతు కుటుంబంలో జన్మించి 50ఏళ్లపాటు సుదీర్ఘ రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించిన ఆయన తన అద్భుతమైన వాగ్ధాటితో అందరి దృష్టిని ఆకర్షించారు. ఐదుసార్లు ఎంపీగా, నాలుగుమార్లు ఎమ్మెల్యేగా, కేంద్రమంత్రిగా కూడా కొనసాగారు.

రైతు కుటుంబంలో జన్మించి ఉన్నత శిఖరాలకు..

కల్వకుర్తి నియోజకవర్గంలోని మధ్య తరగతి రైతు కుటుంబంలో జన్మించిన సూదిని జైపాల్‌రెడ్డి అంచెలంచెలుగా ఎదిగారు. 1942 జనవరి 16న సూదిని దుర్గారెడ్డి, యశోదమ్మ దంపతులకు ఆయన జన్మించారు. మూడో ఏటనే ఆయనకు పోలియో సోకింది. ప్రాథమిక విద్యాభ్యాసాన్ని మాడ్గులలో. ఇంటర్ వరకు దేవరకొండలో చదువుకున్న ఆయన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యనభ్యసించారు. అక్కడే పీజీని పూర్తి చేసిన ఆయన విద్యార్థి దశ నుంచే చురుకుగా వ్యవహరించారు. రెండుసార్లు ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయన 1965 నుంచి 71దాకా యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరించారు.

ఉత్తమ పార్లమెంటేరియన్‌గా....

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఉన్నప్పుడు సూదిని జైపాల్‌రెడ్డికి సుదీర్ఘమైన రాజకీయ అనుభవం ఉంది. తాను నమ్మిన సిద్ధాంతాలను కొనసాగించిన ఆయన నిక్కచ్చితనం, పార్టీలకతీతంగా అభిమానం సంపాదించి పెట్టింది. 1969 నుంచి 1984వరకు కల్వకుర్తి ఎమ్మెల్యేగా నాలుగుసార్లు ఆయన గెలుపొందారు. 1979లో ఇందిరాగాంధీ దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించడంతో విభేదించిన ఆయన జనతా పార్టీలో చేరారు. 1985 నుంచి 1988వరకు జనతా పార్టీ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించిన ఆయన 1984లో టీడీపీ మద్దతుతో మహబూబ్‌నగర్ ఎంపీగా గెలుపొందారు. రెండు మార్లు మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం, తర్వాత మిర్యాలగూడ, చేవేళ్ల స్థానాల నుంచి కూడా గెలుపొంది రికార్డు సృష్టించారు. రెండుసార్లు రాజ్యసభకు కూడా ఆయన ప్రాతినిధ్యం వహించారు.

మంత్రివర్గంలోను తనదైన ముద్ర

ఐకే గుజ్రాల్, మన్మోహన్‌సింగ్ మంత్రివర్గాలలో పని చేసిన సూదిని జైపాల్‌రెడ్డి కేంద్రమంత్రిగా కూడా తనదైన ముద్ర వేశారు. ఐకే గుజ్రాల్ క్యాబినెట్‌లో ప్రసార శాఖ మంత్రిగా పని చేసిన ఆయన ప్రసార భారతి బిల్లును ప్రవేశపెట్టి మీడియా రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చారు. ఆ తర్వాత కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ, పెట్రోలియం శాఖల బాధ్యతలు కూడా నిర్వహించిన ఆయన నిత్య ప్రమాదాలు జరిగే విజయవాడ రోడ్డును ఆధునీకరించేందుకు కేంద్రం నుంచి నిధులు సాధించారు.

తెలంగాణ సాధనలో కీలకపాత్ర

మలిదశ తెలంగాణ ఉద్యమంలో డిల్లీలో లాబీయింగ్ నడపడంలో కూడా జైపాల్‌రెడ్డి కీలక భూమిక పోషించారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందిన తర్వాత ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా నియమించబడే అవకాశం ఉన్నప్పటికీ ఆయన సున్నితంగా తిరస్కరించారు. తెలంగాణకు అనుకూలంగా బీజేపీ మద్దతు కూడా కూడగట్టి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఇవ్వవల్సిన ఆవశ్యకతను సోనియాగాంధీకి వివరించి బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేలా శక్తివంచన లేకుండా కృషి చేశారు.

సీఎం రేవంత్‌రెడ్డితో బంధుత్వం

జైపాల్‌రెడ్డి అనారోగ్య కారణాలతో 2019 జూలై 28న హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో జైపాల్‌రెడ్డికి బంధుత్వం ఉంది. జైపాల్‌రెడ్డి సోదరుడు పద్మనాభరెడ్డి కూతురును రేవంత్‌రెడ్డి వివాహం చేసుకున్నారు. వరుసకు మామ అయిన సూదిని జైపాల్‌రెడ్డి కాంస్య విగ్రహావిష్కరణ ఆదివారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా జరుగుతుండడం విశేషం.

ఒక ఇన్‌చార్జి ఎంఈవో పది బాధ్యతలు

- ఒకే రోజు ఐదు మండలాల బాధ్యతల స్వీకరణ

నారాయణపేట, జూలై 26: ఒకే రోజు ఓ ఇన్‌చార్జి ఎంఈవో ఏకంగా ఐదు మండలాలకు ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించగా ఆయనకు మొత్తం పది బాధ్యతలు ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోంది. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం వేపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం గోపాల్‌నాయక్ 16 స్కూళ్ల కస్టర్ కాంప్లెక్స్ జీహెచ్‌ఎంగా కూడా కొనసాగుతు న్నారు. దీంతో పాటు నారాయణపేట జిల్లాలోని మద్దూర్, దామరగిద్ద, నారాయణపేట మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోగా ఉన్నారు. ఇవేకాకుండా రెగ్యులర్ ఎంఈవోగా ఉండి ఉద్యోగ విరమణ చేసిన వెంకటయ్య బాధ్యతలైన నర్వ, మక్తల్, మాగనూరు, కృష్ణ, ఊట్కూర్ మండలాల ఇన్‌చార్జి బాధ్యతలను అదనంగా శంకర్‌నాయక్‌కు అప్పగిస్తూ డీఈవో అబ్దుల్‌ఘని ఈనెల 23న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఆ బాధ్యతలు కూడా స్వీకరించారు.

ఈ విధంగా మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో మొత్తం పది బాధ్యతల్లో ఒకే ఒక్కడు కొనసాగుతుండటం, ఆయనకు అదనపు భారంకావడంతో పాటు విధులు ఎలా నిర్వహిస్తారని విద్యాశాఖ తీరుపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.


మాగనూరులో ఇన్‌చార్జి ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించిన గోపాల్‌నాయక్

లంచావతారులు

- అధికమవుతున్న అవినీతి
- పనులు కావాలంటే పైసలివ్వాల్సిందే..
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న నిరుపేదలు
- లంచం తీసుకుంటూ పట్టుబడుతున్న అధికారులు

నారాయణపేట, జూలై 26: జిల్లాలో లంచావతారులు అధికమవుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కొందరు పైసలివ్వనిదే పనులు చేయడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో నిరుపేదలు ప్రభుత్వ కార్యాలయంలో ఏదైనా పని చేయించుకోవాల్సి వస్తే భయపడిపోతున్నారు. ముఖ్యంగా రెవెన్యూ కార్యాలయాల్లో కొందరు చేయి తడపనిదే ఫైళ్లు కదలనివ్వడం లేదని స్థానికులు ...న్నారు. ఇందుకు కొందరు ఉదాహరణగా తీసుకోవచ్చు. నాడు మరికల్ ఇన్‌చార్జి తహసీల్దార్ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడగా నేడు మక్తల్ తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ వలలో సర్వేయర్ బాల్‌రాజ్ చిక్కాడు. దీంతో జిల్లా అధికార యంత్రాంగం ఉలిక్కిపడింది. ఈ మధ్యకాలంలో గుండుమాల్ తహసీల్దార్ పాండు రైతుల నుంచి లంచం తీసుకుంటూ పట్టుబడడ్డారు. ఈ నెల 25న మక్తల్ తహసీల్దార్ కార్యాలయంలోని సర్వేయర్ బాల్‌రాజ్ రైతు వెంకటేష్ వ్యవసాయ పొలం సర్వే విషయంలో ముందుగా రూ.3వేలు తీసుకొని సర్వే చేయలేదు. రూ. 9వేలు ఇస్తేనే సర్వేకు వస్తాను అనడంతో రైతు ఏసీబీని ఆశ్రయించాడు. దీంతో ఏసీబీ అధికారులు ట్రాప్ చేసి లంచం తీసుకుంటున్న సమయంలో సర్వేయర్ పట్టుకున్నారు. జిల్లాలో గతేడాది డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏసీబీ అధికారులు ట్రాప్ చేసి జిల్లా మాస్ మీడియా అధికారి హన్మంతు ఓ ప్రయివేటు ఆసుపత్రి అనుమతి కోసం రూ.25 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఈ మధ్య కాలంలో రైతులు వివిధ పనుల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా లంచం లేనిదే పనులు కావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో మరికల్ తహసీల్దార్ పట్టుబడ్డ కొన్ని రోజులకే అదే కార్యాలయంలో సిబ్బంది కూడా అవినీతికి పాల్పడుతూ పట్టుబడ్డారు. దామరగిద్ద తహసీల్దార్ వెంకటేష్, గుండుమాల్ తహసీల్దార్ పాండు, ధరణి ఆపరేటర్ రవీందర్‌లు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. గతంలో మరికల్ ఇన్‌చార్జి తహసీల్దార్ జగన్, సీనియర్ అసిస్టెంట్ తాహేర్‌లు ఏసీబీకి చిక్కారు. మరికల్ తహసీల్దార్ శ్రీధర్ విరాసత్ కోసం రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. మక్తల్ సబ్‌రిజిస్ట్రార్ హబీబొద్దీన్ రూ.75 వేలు లంచం తీసుకుంటూ 2019, నవంబర్ 21న ఏసీబీకి చిక్కాడు. దామరగిద్ద జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం బాల కిష్టయ్య 2019 మార్చి 5న ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. 2018లో నర్వ ఎంపీడీవో రాఘవ ఏసీబీకి పట్టుబడ్డారు. ఊట్కూర్ ఆర్ఐ సతీష్‌కుమార్‌రెడ్డి 2018లో రూ.10 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. మక్తల్ మండలం గుడిగండ్ల వీఆర్వో విష్ణు రూ.10వేలు లంచం తీసుకున్నారంటూ ఏసీబీకి చిక్కారు. ఇలా పలువురు అవినీతి అధికారులు ఏసీబీకి చిక్కుతున్నా కార్యాలయాల్లో లంచావతారులు మాత్రం తగ్గడం లేదు. ఎవరు లంచం అడిగినా ఏసీబీని ఆశ్రయించాలని, టోల్ ఫ్రీ నంబరు 1064కు డయల్ చేయాలని ఏసీబీ అధికారులు సూచిస్తున్నారు.


ఏసీబీకి చిక్కిన మక్తల్ సర్వేయర్ బాల్‌రాజ్(ఫైల్)

ఆర్డీఎస్ రైతుల్లో.. ఆశలు

సాగుకు సిద్ధమవుతున్న ఆయకట్టు రైతులు


ఆర్డీఎస్ ప్రధాన ఆనకట్ట పై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

అయిజ, జూలై 26: ఆర్డీఎస్ రైతుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. కర్ణాటకలో వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో ఆర్డీఎస్ ప్రధాన నీటి వనరు అయిన తుంగభద్ర నదికి పెద్ద మొత్తంలో వర్షం నీరు వచ్చి చేరింది. డ్యాం నీటి నిల్వ శాతం 105.788 కాగా 103 టీఎంసీలకు చేరింది. ప్రతీ రోజు లక్షల కూసెక్కుల నీరు డ్యాంకు చేరుతుండటంతో దీనితో మూడు రోజులుగా దిగువకు నీరు వదులుతున్నారు. తుంగభద్ర నది ద్వారా వదిలిన నీరు ఆర్డీఎస్ ఆనకట్టకు గురువారం రాత్రి చేరింది.

ఆర్డీఎస్‌కు చేరిన నీరు..

ఈ ఆర్డీఎస్ ఆనకట్ట నుంచి జోగుళాంబ గద్వాల జిల్లాలోని అలంపూర్ నియోజకవర్గ రైతులకు సాగునీరు అందిస్తోంది. గతంలో ఆర్డీఎస్ (రాజోళి బండ డైవర్షన్ స్కీమ్)ను కర్ణాటకలోని మాన్వీ తాలూకాలోని రాజోళి బండ గ్రామం వద్ద ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మధ్యన తుంగభద్రనది ఉంది. ఈ ప్రాజెక్టు ద్వారా కర్ణాటకలోని మాన్వీ తాలూకాలో 15, తెలంగాణలోని గద్వాల, అలంపూర్ తాలూకాలో 75, కర్నూల్ జిల్లాలోని నాలుగు గ్రామాలకు సాగునీరు అందించాల్సి ఉంది. తుంగభద్ర నది వరదనీటి ద్వారా 9.30 టీఎంసీలు, తుంగభద్ర డ్యాం నుంచి 6.51 టీఎంసీల నీటి వాటా ఉంది. రబీలో 47.769 ఎకరాలకు, ఖరీఫ్‌లో 35.127 ఎకరాలకు ఆర్డీఎస్ నుంచి నీరు రావాల్సి ఉంది. మొత్తంగా 87,500 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. ప్రధాన ఆనకట్ట నుంచి కాలువ 42.6 కిలోమీటర్లు కర్ణాటక పరిధి, 42.6 నుంచి 142 కిలోమీటర్ల వరకు ప్రస్తుత తెలంగాణ ప్రాంతంలో ప్రధాన కాలువ సాగుతోంది. తుంగభద్ర డ్యాం నుంచి దిగువకు నీరు వదలటంతో ఈ ఆనకట్టకు నీరు చేరింది. ఆనకట్ట పైభాగం నుంచి ఒకటిన్నర ఫీట్ల ఎత్తులో నీరు దిగువ తుంగభద్ర నదికి పారుతోంది.

రైతుల్లో రేకెత్తుతున్న ఆశలు

ప్రస్తుతం జోగుళాంబ గద్వాల జిల్లాలోని అలంపూర్ నియోజకవర్గ రైతులు ప్రధానంగా తుంగభద్ర డ్యాంపైనే ఆశలు పెట్టుకుంటారు. డ్యాం నిండిందంటే దిగువకు నీరు వదులుతారు. ఆ నీరు ఆర్డీఎస్ ఆనకట్టకు నీరు చేరుకుంటుంది. ప్రస్తుతం డ్యాం నుంచి నీరు వదలుతున్నారు. ఆనకట్ట వద్ద ఉన్న ప్రధాన కాలువ గేట్లు శుక్రవారం మధ్యాహ్నం ఎత్తి ఆర్డీఎస్ కాలువకు వదిలారు. శనివారం తెల్లవారుజాము వరకు తెలంగాణ సరిహద్దు చేరుకుంటుంది. నీరు కాస్త దిగువ అలంపూర్ నియోజకవర్గ ప్రాంతం లో అలంపూర్ వరకు ప్రవహించాల్సి ఉంది. నీటి సౌకర్యం ఉన్న రైతులు ఇప్పటికే నారుపోసుకొని వరి నాటేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రస్తుతం నీరు వదలటంతో వారు నాట్లు వేస్తున్నారు. మరి కొంత మంది రైతులు నారు కొనుగోళ్ల కోసం వివిధ ప్రాంతాలకు పరుగెత్తుతున్నారు. ఇప్పటికే ఆర్డీఎస్ రైతులు వరి పంట సాగుకు పంట పొలాలను సిద్ధం చేసుకుని వరి నాటువేసేందుకు సిద్ధంగా ఉన్నారు.




ఆనందంగా ఉంది

ఈ సారి గతంలో కంటే కూడా ముందస్తుగా కాలువకు నీరు రావటం ఆనందంగా ఉంది. మేము వరి నారు పోసుకోలేదు. కర్ణాటక, రాయలసీమ ప్రాంతాల నుంచి వరినారు కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నాం. ఈ ఏడాది పంట దిగుబడి మంచిగానే ఉంటుందనే ఆశతో ఉన్నాము.


- బజారి, రాజాపూర్


అలంపూర్ నియోజకవర్గంలోని ఆర్డీఎస్ ప్రధాన కాలువ



పేకాట స్థావరంపై దాడులు

అలంపూర్ చౌరస్తా, జూలై 26 : పేకాట స్థావరంపై దాడి చేసి వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు శివారులోని ముళ్ల పొదల్లో శుక్రవారం పేకాటాడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్ఐ శ్రీనివాస్‌నాయక్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. దాడిలో ముగ్గురు పట్టుబడగా, మరో నలుగురు పరారైనట్లు ఎస్ఐ తెలిపారు. నాలుగు ద్విచక్రవాహనాలు, మూడు సెల్‌ఫోన్లు, 15 వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.








సుంకేసుల డ్యాం నుంచి నీటి విడుదల

రాజోలి, జూలై 26 : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి శివారులోని సుంకేసుల డ్యాం నుంచి శుక్రవారం నీటిని విడుదల చేసినట్లు జేఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి నీటిని విడుదల చేస్తుండటంతో మరో రెండు రోజుల్లో సుంకేసుల డ్యాంకు వరద పోటెత్తే అవకాశం ఉందన్న సమాచారంతో ముందస్తుగా డ్యాం రెండు గేట్లు తెరిచి 8,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. డ్యాం పూర్తి సామర్థ్యం 1.20 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 0.48 టీఎంసీ నీరు నిల్వ ఉందని చెప్పారు. గరిష్ఠ నీటిమట్టం 292 మీటర్లు కాగా, ప్రస్తుతం 289.70 మీటర్లుగా నమోదు అయినట్లు తెలిపారు.

ఆర్డీఎస్ కాలువకు నీటి విడుదల

వడ్డేపల్లి: ఆర్డీఎస్ కెనాల్‌కు శుక్రవారం కర్ణాటక నీటిపారుదల శాఖ డీఈ శాంతిరాజు, లష్కర్ కరెప్ప నీరు విడుదల చేశారు. ప్రాజెక్టు నుంచి 470 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని, శనివారం నాటికి తెలంగాణ సరిహద్దుకు సాగునీరు చేరుకుంటుందని వారు తెలిపారు. కాలువల్లో పెరిగిన కంపచెట్లను తొలగించాలని రైతులు అధికారులను కోరారు. నీటిని విడుదల చేసినందుకు ఆర్డీఎస్ ఆయకట్టుదారుల సంఘం మాజీ చైర్మన్ సీతారాంరెడ్డి అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.


సుంకేసుల డ్యాం నుంచి విడుదల అవుతున్న నీరు







దోషికి యావజ్జీవ కారాగార శిక్ష, జరిమానా

- ఎస్పీ యోగేష్‌గౌతమ్

నారాయణపేట, జూలై 26: వ్యక్తి హత్య కేసులో దోషికి యావజ్జీవకారాగార శిక్ష, రూ. 21 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం జిల్లా న్యాయాధికారి అబ్దుల్ రఫీ తీర్పునిచ్చారని ఎస్పీ యోగేష్ గౌతమ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండలం కొండాపూర్‌కు చెందిన లక్ష్మారెడ్డి (39) రెండు సంవత్సరాల క్రితం అనంతయ్య అనే వ్యక్తికి ఇచ్చిన లక్ష రూపాలయలు, వడ్డీతో కలిపి రూ.1.40 లక్షలు తిరిగి ఇవ్వమని పలుమార్లు అడగడంతో డబ్బులు ఇస్తానని పొలం దగ్గరు రావాలని పిలిపించాడు. మద్యం తాగించి మత్తులో ఉన్న లక్ష్మారెడ్డిని అనంతయ్య కర్రతో దాడి చేసి హత్య చేశాడు. 2023 ఫిబ్రవరి ఐదున లక్ష్మారెడ్డి సోదరుడు వెంకట్‌రెడ్డి ధన్వాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ అకుల బాలప్ప 21మంది సాక్షులను విచారించి వాదనలను వినిపించారు. కోర్టు లీజనింగ్ అధికారి శంకరయ్య, కోర్టు డ్యూటీ అధికారి అరవింద్‌కుమార్, పీపీ రామాంజనేయులు, హన్మంతులు సమాన్స్ ఇచ్చి సాక్షులను ప్రవేశపెట్టి నిందితుడిపై నేరం నిరూపణ కావడంతో న్యాయాధికారి శిక్ష ఖరారు చేస్తూ తీర్పు ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులను, పీపీలను ఎస్పీ అభిందించారు. త్వరలో రివార్డులు ఇస్తామని ప్రకటించారు.

రేవల్లి మండల వాసికి జీవిత ఖైదు

రేవల్లి, జూలై 26 : వనపర్తి జిల్లా రేవల్లి మండల కేంద్రంలో 2020లో జరిగిన హత్య కేసులో ఒక నిందితుడికి జీవిత ఖైదీగా జైలు శిక్ష విధించారు. ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం.. రేవల్లికి చెందిన మేదరమని మల్లేష్ మద్యానికి బానిసై భార్యను వేధిస్తుండేవాడు. భార్యకు వచ్చిన కూలి డబ్బులు ఇవ్వాలని అడగడంతో ఆమె నిరాకరించింది. దీంతో కోపోద్రిక్తుడైన మల్లేష్ భార్యపై గడ్డపారతో దాడి చేశాడు. స్పృహ కోల్పోవడంతో చుట్టుపక్కల వాళ్లు గమనించి ఆమెను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడైన మల్లేష్‌కు వనపర్తి జిల్లా డిస్ట్రిక్ట్ స్పెషల్ న్యాయాధికారి జీవిత ఖైదుతో పాటు, రూ.రెండు వేల జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 26 : భూమిలో నీటి వాటా విషయంలో గొడవ జరగడంతో దాడికి గురైె నాగేశు(45) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని తూడుకుర్తి గ్రామానికి చెందిన కృష్ణయ్య, నాగేశు అన్నదమ్ములు తమ వ్యవసాయ భూములు నీటి వాటా విషయంలో గొడవ పడుతుండగా కృష్ణయ్య కుమారుడు రాంబాబు గొడ్డలితో నాగేశుపై దాడి చేశారు. తీవ్ర గాయాలైన అతడు నాగర్‌కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఈ సంఘటనపై మృతుని కుమారుడు కరుణాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పీర్ల వెండి వస్తువుల అపహరణ

- నాగర్‌కర్నూల్‌లోని సంత బజారులో చోటు చేసుకున్న ఘటన

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 26 : వెండి వస్తువులు దాదాపుగా ఒక కిలో అపహరణకు గురైనట్లు స్థానికులు శుక్రవారం తెలిపారు. వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సంత బజార్‌లో కొంతమంది యువకులు కలిసి పీర్ల చావిడిలో పీర్లను కూర్చొబెట్టారు. అట్టి పీర్లకు సంబంధించిన వెండి వస్తువులను గుర్తు తెలియని దుండగులు అపహరించుకుని వెళ్లారు. వాటి విలువ దాదాపుగా 35వేల పైన ఉంటుందని వారు పేర్కొన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు.

రైల్వేస్టేషన్‌ను పరిశీలించిన జనరల్ మేనేజర్


రైల్వే జీఎంకు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీనియర్ సిటిజన్స్ ఫోరం నాయకులు

గద్వాల అర్బన్, జూలై 26 : సాధారణ తనిఖీల్లో భాగంగా దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ శుక్రవారం గద్వాల రైల్వేస్టేషన్‌ను పరిశీలించారు. డోన్ జంక్షన్ గుండా కర్నూలు మీదుగా గద్వాల స్టేషన్‌కు చేరుకున్న అధికారుల బృందం అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. అమృత్ భారత్, అమృత్ రైల్వే మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ ముఖద్వారం, వాహనాల పార్కింగ్ స్థలం, కొత్తగా నిర్మిస్తున్న రైల్వే లైన్లు, ప్లాట్‌ఫాంలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనను గద్వాల సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు మోహన్‌రావు, మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్పీ అచ్చన్నగౌడ్‌లు కలిసి మాట్లాడారు. మేళ్లచెరువు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. స్టేషన్ సమీపంలో ఉన్న 120 ఎకరాల స్థలంలో ఈఎస్ఐ ఆస్పత్రి, మెడికల్ కళాశాల ఏర్పాటుకు సంబంధించి గతంలో తాముచేసిన విజ్ఞప్తి మేరకు నీతిఆయోగ్ నుంచి సంబంధిత అధికారులకు లేఖ అందినట్లు ఆయనకు వివరించారు. అందుబాటులో ఉన్న రైల్వే స్థలాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



ఊపందుకున్న వరి నాట్లు

- వర్షాలు పడుతుండటంతో రైతుల ఆనందం


కేటీదొడ్డిలో నాటు వేస్తున్న కూలీలు

కేటీదొడ్డి, జూలై 26 : జోగుళాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా వర్షాలు పడుతుండటంతో వాగులు, వంకలు, చెరువుల్లోకి నీరు చేరింది. ఎగువ రాష్ట్రాల్లో కూడా భారీ వర్షాలు పడుతుండటంతో జూరాల ప్రాజెక్టుకు వరద వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు నుంచి ర్యాలంపాడు రిజర్వాయర్‌కు నీటిని వదులుతున్నారు. ర్యాలంపాడు నుంచి 99 ప్యాకేజీ కాలువక నీరు విడుదల చేయడంతో కేటీదొడ్డి మండలంలోని ఉమిత్యాల, ఉమిత్యాల తండా, కొండాపురం, కేటీదొడ్డి, వెంకటాపురం, గువ్వలదిన్నె తదితర గ్రామాలకు చెందిన రైతులు, కాలువ పక్కనే పొలం ఉన్న వారు, పైప్‌లైన్ ద్వారా నీరు పారించుకొని వరి సాగుకు సిద్ధం అవుతున్నారు.

వరిసాగుపైనే రైతుల ఆసక్తి

ఈ సీజన్లో రైతులు ఆరుతడి పంటల కంటే వరి సాగుపైనే ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. గతేడాది రైతులు పత్తి, మిరప ఎక్కువగా సాగు చేశారు. మిరప పంటకు సరైన ధర లేకపోవడంతో చాలా మంది రైతులు కోల్డ్ స్టోరేజీలలో నిల్వ చేసుకున్నారు. వరి పంటకు మంచి ధర లభించడంతో ఈ సారి చాలామంది రైతులు సాగుకు సిద్ధం అవుతున్నారు. వ్యవసాయశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలో గతేడాది 13 వేల ఎకరాలలో వరిసాగు చేశారు. ఈ ఏడాది ఇప్పటికే చాలా మంది రైతులు వరి సాగు చేశారని, వర్షాలు విస్తారంగా పడుతుండడంతో ఇంకా చాలా మంది రైతులు వరి సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. కాలువల ద్వారా నీరు అందుబాటులో ఉన్న వారితో పాటు, బోర్లపై ఆధారపడి వ్యవసాయం చేసే రైతులు కూడా ఎక్కువ శాతం వరి సాగు చేస్తున్నారు. చేయడానికి ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు.


కేటీదొడ్డిలో ట్రాక్టర్‌తో కరిగెట చేస్తున్న రైతు

తగిన జాగ్రత్తలు పాటించాలి

వర్షాకాలం వేసే వరి పంటను ఎక్కువగా కాండం తొలుచు పురుగు ఆశిస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు చెప్తున్నారు. ఈ పురుగు ఆశించకుండా ఉండడానికి వరి నాటిన 20 నుంచి 25 రోజుల్లో పంట పొట్ట దశలో, ఎకరానికి కార్టప్ హైడ్రోక్లోరైడ్ 400గ్రాములు ఎకరాకు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 60 మిల్లీలీటర్లు పిచికారి చేయాలని సూచిస్తున్నారు. దోమ ఆశించకుండా ఉండటానికి ఎకరాకు ప్రతీ దఫాలో 30 కిలోల యూరియాను మించి వాడొద్దని చెప్తున్నారు. ఇంకా ఏమైనా సందేహాలు ఉంటే తమను సంప్రదించి తగిన సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని రైతులకు సూచిస్తున్నారు.

ఈ పంటకు ఇబ్బంది లేదు



ఈ సీజన్లో ముందుగానే వర్షాలు ఎక్కువగా పడుతున్నాయి. ర్యాలంపాడు నుంచి కాలువలకు నీరు వస్తుండటంతో పంట చేతికి వచ్చే వరకు సాగునీటికి ఇబ్బంది ఉండదు. ధరలు కూడా ఎక్కువగా ఉండడంతో నాకున్న ఐదు ఎకరాల్లో మొత్తంగా వరి సాగు చేశాను.

- గోవర్ధన్, రైతు, కేటీదొడ్డి

అధికారుల సూచనలు పాటించాలి

పంటల సాగుపై ఏవైనా సందేహాలుంటే వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించి, తగిన సూచనలు తీసుకోవాలి. బోర్లపై ఆధారపడి పంటలు వేసుకునే రైతులు, అందుబాటులో ఉన్న నీటికి సరిపడే విధంగా సాగు చేసుకోవాలి. ఎందుకంటే పంట చివరి దశకు వచ్చే సమయానికి వర్షాలు తగ్గిపోతాయి. ఆ సమయంలో సాగునీరు అందకపోతే పంట ఎండిపోయి నష్టపోవాల్సి వస్తుంది.

- మహాలక్ష్మి, మండల వ్యవసాయశాఖ అధికారి

బాలానగర్ జ్యువెలరీ షాపులో చోరీ

- దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ జానకి


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ జానకి, పోలీసు అధికారులు

బాలానగర్, జూలై 26 : మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో గల కృష్ణ జ్యువెలరీ షాప్‌లో గురువారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. అదే సమయంలో హైవే పైన రాందేవ్‌బాబా కిరాణం ముందు గల ఓమ్ని వాహనాన్ని దొంగిలించి అక్కడి నుంచి రైల్వే స్టేషన్ రోడ్డులో గల కృష్ణ జ్యువెల్లరీ షాపు దగ్గరికి వచ్చి అక్కడ వాహనాన్ని నిలిపి కట్టర్ సహాయంతో షట్టర్ తాళాలను కత్తిరించి గుణపాలతో షట్టర్‌ను తెరిచారని జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్ తెలిపారు. కృష్ణ జ్యువెలరీ షాపులో 10 కేజీల వెండి, రెండు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు తెలిపారు. అలాగే దొంగిలించిన ఓమ్ని వాహనాన్ని రాజాపూర్ దగ్గరలోని రాజస్థానీ దాబా దగ్గర నిలిపి అక్కడి నుంచి పారారైనట్లు తెలిపారు. క్లూజ్ టీం వారు వచ్చి సంఘటన స్థలంలో వేలిముద్రల ఆధారాలు సేకరించినట్లు తెలిపారు. తొందరలోనే నిందితులను పట్టుకుంటా మని తెలిపారు. చోరీకి గురైన జ్యువెలరీ షాపును ఎస్పీ జానకి, డీఎస్పీ వెంటేశ్వర్లు పరిశీలించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి త్వరలోనే నింధితులను పట్టుకుంటామని సీఐ నాగార్జునగౌడ్, ఎస్ఐ తిరుపాజీ తెలిపారు.

ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్ల పరిశీలన

- కలెక్టర్ బదావత్ సంతోష్


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, జూలై 26 : ఈ నెల 28న కల్వకుర్తిలో పర్యటించనున్న ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం కల్వకుర్తి, అచ్చంపేట ఎమ్మెల్యేలు కశిరెడ్డి నారాయణరెడ్డి, డాక్టర్ వంశీకృష్ణలతో కలిసి కలెక్టర్ బదావత్ సంతోష్ పరిశీలించారు. కల్వకుర్తి పట్టణంలోని ముని సిపల్ కార్యాలయం పక్కనే ఏర్పాటు చేసిన సభా స్థలిని, కొట్రగేటు వద్ద ఏర్పాటు చేసిన దివంగత మాజీ కేంద్ర మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి కాంస్య విగ్రహా విష్కరణ ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేసేందుకు ఎవరి విధులు వారు సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. సభా ప్రాంగణం వద్దకు జనం వచ్చేందుకు వీలుగా పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండాలన్నారు. ముఖ్యమంత్రి కాన్వాయ్ స్టేజీ వద్దకు వచ్చే మార్గాన్ని వారు పరిశీలించారు. కొట్ర గేటు వద్ద జంక్షన్‌వద్ద నాలుగు రోడ్ల కూడలిలో హైదరాబాద్, శ్రీశైలం రహదారి జంక్షన్‌లో సుందరీకరణ పనులతో పాటు వివిధ రకాల మొక్కలను ఏర్పాటు చేయాలని హెచ్‌ఎండీఏ అధికారులను ఆదేశించారు. విగ్రహం చుట్టూ సుందరీకరణ పనులను వేగంగా చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యమంత్రితో పాటు ప్రముఖులు వివిధ రకాల మొక్కలు నాటేలా ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ కే.సీతారామారావు, కల్వకుర్తి ఆర్డీవో ఎస్.శ్రీను, డీఎస్పీ వెంకటేశ్వర్లు, హెచ్‌ఎండీఏ సుందరీకరణ మేనేజర్ రాణి రుద్రమ, హార్టికల్చర్ అధికారి చక్రపాణి, మునిసిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని అడ్డుకోవాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం. బాలనరసింహ


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం. బాలనరసింహ

పాలమూరు, జూలై 26 : దేశంలో బీజేపీ మతోన్మాదాన్ని పెంచిపోషిస్తుందని, మతోన్మాద బీజేపీని అడ్డుకునేందుకు దేశప్రజలంతా సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాల్‌నరసింహ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని విష్ణు కన్వెన్షన్ హాల్‌లో ఉమ్మడి పాలమూరు జిల్లాల సమితి సభ్యుల రెండ్రోజుల రాజకీయ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. బీజేపీ భక్తిపేరుతో ప్రజలను మభ్యపెట్టి మరోసారి అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. ప్రజల నమ్మకాన్ని ఓట్ల రూపంలో సొమ్ముచేసుకోవడంలో బీజేపీ దిట్ట అని విమర్శించారు. పట్టణాలు, గ్రామాలలో పండగల పేరిట ప్రజలను ఏకం చేయడానికి స్వార్థ రాజకీయ ప్రయోజనాలే కారణమన్నారు. మహిళల్లో భక్తి పేరిట బీజేపీ విషాన్నినింపుతూ ఎన్నిలలో లబ్ధిపొందుతుందన్నారు. ఈ విషయాలను సీపీఐ కార్యకర్తలు గ్రామస్థాయి నుంచి అడ్డుకునే ప్రయత్నం చేయాలన్నారు. ప్రజా సమస్యలే ఎజెండాగా నిరంతరం ప్రజలతో మమేకం కావడానికి కార్యకర్తలు శక్తివంచనలేకుండా శ్రమించాలని పేర్కొన్నారు. దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ 1966లో ప్రభుత్వ ఉద్యోగులు ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలలో పాలుపంచుకోరాదని చేసిన చట్టాన్ని రద్దుచేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. అంతకుముందు అరుణపతాకాన్ని ఆవిష్కరించి, విప్లవోద్యమ అమరవీరులకు ఘనంగా నివాళ్లర్పించారు. తెలంగాణ ప్రజానాట్యమండలి కళాకారులు ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు బీఎస్ఆర్ మోహన్‌రెడ్డి, పానుగంటి పర్వతాలు, సైకాలజిస్ట్‌డా.లక్ష్మణ్, సీపీఐ జిల్లాకార్యదర్శి బాలకిషన్,వనపర్తిజిల్లా కార్యదర్శి విజయ రాములు, నారాయణపేట జిల్లా కార్యదర్శి హెచ్‌కొండన్న, గద్వాల జిల్లా కార్యదర్శి బి ఆంజనేయులు, నాయకులు వార్ల వెంకటయ్య, హెచ్‌ఆనంద్, ఫయాజ్, కేశవులు, శ్రీనివాస్, పి సురేశ్, రాములు, రాజు, వెంకటేశ్, రమేశ్, పవన్, అమరజ్యోతి, అల్వాల్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లాలోని అన్ని డిపోలు లాభాల బాట పట్టాయి



మాట్లాడుతున్న ఈడీ పురుషోత్తం నాయక్

మహబూబ్‌నగర్ టౌన్, జూలై 26 : జిల్లాలోని 10 డిపోలు లాభాలు ఆర్జించి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచాయని హైదరాబాద్ జోన్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పుషోత్తంనాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఉమ్మడి జిల్లాలోని 10 ఆర్టీసి డిపోలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కార్మికులకు ప్రతిభ పురస్కారాలు అందజేసే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా 3వేల బస్సులు రానున్నాయని, ఉమ్మడి జిల్లాలోని పది డిపోలకు 100 బస్సులు రానున్నాయని తెలిపారు. ఇతర జిల్లాలో పనిచేస్తున్న ఈ జిల్లాకు చెందిన 180 మంది డ్రైవర్లు మళ్లీ స్వంత జిల్లాకు బదిలీపై రానున్నట్లు ఆయన తెలిపారు. త్వరలోనే నోటిఫికేషన్ వస్తాయన్నారు. సంస్థకు త్వరలో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆయన వివరించారు. ఆర్‌ఎం శ్రీదేవి మాట్లాడుతూ 2022 నవంబర్‌లో 20 కోట్ల నష్టంతో ఉన్న రీజియన్, 2023 సంవత్సరంలో ఆ నష్టాన్ని భర్తీ చేస్తూ 26 కోట్ల లాభం వచ్చిందని పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చి నాటికి రూ. 50 కోట్ల లాభం ఆర్జిస్తామని, ఇదంతా కార్మికుల కృషి ఫలితమే అని అభినందించారు. అనంతరం ప్రతిభావంతులైన 28 మంది కార్మికులకు ఈడీ ప్రతిభ పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎంలు శ్యామల, లక్ష్మీధర్మ, డి.యం. సుజాత, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పీయూకి అరకొర నిధులే..

- ప్రతిపాదనలు రూ.160 కోట్లు, కేటాయింపు రూ.11.74 కోట్లు
- గత ప్రభుత్వం మాదిరిగానే ...
- ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి
- విద్యార్థి సంఘాల నాయకులు, విద్యావేత్తలు

పాలమూరు యూనివర్సిటీ, జూలై 26 : వెనుకబడిన పాలమూరు జిల్లా ఉన్నత విద్యారంగంలో రాణించాలనే లక్ష్యంతో 2008వ సంవత్సరంలో పాలమూరు యూనివర్సిటీని ఏర్పాటు చేశారు. యూనివర్సిటీ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు అరకొర నిధులతోనే నెట్టుకొస్తున్నారు. ప్రతీ ఏడాది లాగానే ఈ ఏడాది కూడా యూనివర్సిటీ అధికారులు వేతనాల కోసం రూ. 47.39 కోట్లకు, యూనివర్సిటీ అభివృద్ధి కోసం రూ.112.88 కోట్లు మొత్తం రూ.160.27 కోట్ల నిధులకు ప్రతిపాదనలు పంపగా 2024-2025 రాష్ట్ర బడ్జెట్‌లో పాలమూరు యూనివర్సిటీకి కేవలం 11.74 కోట్లు కేటాయించారు. గత ఏడాది 2023-2024లో వేతనాలకు 28.50 కోట్లకు, అభివృద్ధికి రూ.84 కోట్లకు మొత్తం రూ.112.50 కోట్లకు ప్రతిపాదనలు పంపగా రూ.10.91 కోట్లు మాత్రమే కేటాయించారు.



పాలమూరు యూనివర్సిటీ

అందులోనూ రూ.10కోట్లు పూర్తిగా విడుదల చేయలేదని విద్యార్థులు అంటున్నారు. పాలమూరు యూనివర్సిటీకి ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డాక అధిక నిధులు వస్తాయని అనుకుంటే పదేళ్ల పాలనలో లాగే మొండి చెయ్యి చూపారు. ఈ ఏడాది బడ్జెట్‌లో యూనివర్సిటీ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తారని, ఇప్పుడు వచ్చినవి కేవలం వేతనాలు, మౌలిక వసతులకే అని అధికారులు అంటున్నారు. కానీ, గత బడ్జెట్‌లో అభివృద్ధికి ప్రత్యేక నిధులు, వేతనాలకు కేటాయింపులు వేర్వేరని, అభివృద్ధికి ఒక్క రూపాయి ఇవ్వకుండా కేవలం వేతనాలకే ఇచ్చారని విద్యార్థులు, విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

విద్యారంగానికి ఆశించిన బడ్జెట్ కేటాయించలేదు



రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి ఆశించిన మేర నిధులు కేటాయించలేదు. గత కొన్ని సంవత్సరాలకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్, మెస్ బకాయిలు విడుదల చేయలేదు. పాలమూరు విశ్వవిద్యాలయం అభివృద్ధి కోసం పూర్తిస్థాయిలో బడ్జెట్ కల్పన జరగలేదు. పాలమూరు యూనివర్సిటీకి తీవ్ర అన్యాయం జరిగింది. వెనుకబడిన పాలమూరు యూనివర్సిటీకి ప్రత్యేక నిధులు కేటాయించాలి.

- బత్తిని రాము, పీయూ విద్యార్థి జేఏసీ అధ్యక్షుడు

ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి



అన్ని విధాలుగా వెనుకబడిన జిల్లా, సియం రేవంత్ రెడ్డి సొంత జిల్లాలో ఉన్న యూనివర్సిటీకి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని కోరారు. యూనివర్సిటీలో విద్యార్థులకు మౌలిక వసతులు లేవని, గర్ల్స్ హాస్టల్‌లో ఒక్క గదిలో పది మంది విద్యార్థులు ఉంటు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూనివర్సిటీ ప్రత్యేక ప్యాకేజీ ద్వారా రూ.250 కోట్లు కేటాయించి యూనివర్సిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని సియంను కోరుతున్న.

- రూప్ సింగ్, పీయూ విద్యార్థి నాయకుడు

విద్యాప్రమాణాలు మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యం

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- సీఎం చేతుల మీదుగా విద్యార్థులకు షూస్ పంపిణీ చేయించిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, జూలై 26 : రాష్ట్రంలో విద్యాప్రమాణాలు మరింత మెరుగుపరచాలన్న లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో శుక్రవారం జడ్చర్ల నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అందిస్తున్న షూస్‌ను సీఎం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ విద్యారంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నారని, విద్యాప్రమాణాలు పెంచేందుకు గత సంవత్సరం కంటే రూ.2199 కోట్లు అధికంగా కేటాయించినట్లు వెల్లడించారు. గత సంవత్సరం గత ప్రభుత్వం రూ.19093 కోట్లు కేటాయిస్తే, ఈ ఏడాది రూ.21292 కోట్లు కేటాయించిందని వివరించారు. విద్యార్థులకు బ్రాండెడ్ షూస్‌ను ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అందించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో చేపట్టిన పాదయాత్ర సందర్భంగా పేద విద్యార్థులు కాళ్లకు చెప్పులు లేకుండా పాఠశాలకు వెళ్తుంటే చూసానని,


జడ్చర్ల నియోజకవర్గంలోని విద్యార్థులకు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అందిస్తున్న బూట్లను విద్యార్థులకు పంపిణీ చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

అందుకే ఇప్పుడు ఇస్తున్నట్లు తెలిపారు. పారిశ్రామిక వేత్తలు, స్వచ్ఛందసంస్థల సహకారంతో నియోజకవర్గంలోని విద్యార్థులకు ట్యాబ్‌లను ఇచ్చేందుకు కృషి చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ డీఈఓ రవీందర్, నాగర్‌కర్నూల్ డీఈఓ గోవిందరాజులు, జడ్చర్ల ఎంఈఓ మంజులా దేవి, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిల్లా జైలు తనిఖీ


జైలు అధికారులతో మాట్లాడుతున్న న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి ఇందిర

మహబూబ్‌నగర్, జూలై 27 : రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర జిల్లా జైలును సందర్శించారు. అక్కడ ఖైదీలకు అందుతున్న సేవలు, వసతులను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలతో ఆమె మాట్లాడారు. భోజనం, నీటి వసతి ఎలా ఉందనే విషయాలను అడిగారు. వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అడ్వకేట్‌ను పెట్టుకునే స్థోమత లేని వారికి లోక్ అదాలత్ ద్వారా ఉచితంగా లీగల్‌ఎయిడ్ కౌన్సిల్‌ను నియమిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ వెంకటేశం పాల్గొన్నారు.

దూసుకుపోయిన లారీ..తప్పిన ప్రమాదం

గండీడ్, జూలై 26 : మండల పరిధిలోని రంగారెడ్డిపల్లి దగ్గర జాతీయ రహదారి 167 రోడ్డు మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. ఐదారు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో గురువారం ఉదయం బండల లారీ తాండూర్ వైపు వెళ్తుండగా రోడ్డు మధ్యలోను బేరింగ్ పోవడంతో నిలిచిపోయిం ది. శుక్రవారం ఉదయం తాండూర్ వైపు వెళ్తున్న పైపుల లోడ్‌తో వెళ్తుండగా రంగారెడ్డి పల్లి దగ్గర ఇంటివైపు దూసుకపోయింది. డ్రైవర్ కంట్రోల్ చేశాడు. నడి రోడ్డుపై లారీ ఆగినందుకే లారీ పక్కకు దూసుకపోయింది. ప్రమాదం తప్పింది. వెంటనే రోడ్డు మరమ్మతును వెంటనే పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు శిక్ష

ఖిల్లాఘణపురం, జూలై 26 : మండలంలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలో పట్టుబడిన ముగ్గురు వ్యక్తులకు శుక్రవారం కోర్టు న్యాయాధికారి రెండురోజుల జైలుశిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు. సల్కెలాపురం గ్రామానికి చెందిన బోయిని వెంకటేష్, వెంకటాంపల్లికి చెందిన కావలి సాయిబాబ, వెనికితండాకు చెందిన మూడావత్ హనుమంత్‌లకు వనపర్తి రెండవ అదనపు కోర్టులో న్యాయాధికారి జానకి శిక్ష ఖరారు చేసినట్లు వివరించారు.

నాటుకోళ్లు అపహరణ

మహమ్మదాబాద్, జూలై 26 : పొలం వద్ద రైతు నాటుకోళ్ల షెడ్ నుంచి గురువారం అర్ధరాత్రి 14 నాటు కోళ్లు అపహరణకు గురైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుందని రైతు, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి మాణిక్ ప్రభు తెలిపారు. రోజు మాదిరిగా పొలంలో ఉన్న షెడ్‌లో నాటు కోళ్లను ఉంచి తాళం వేసి తాను మహబూబ్‌నగర్‌లో తన ఇంటికి వచ్చినట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం పది గంటలకు పోలంలోని షెడ్ దగ్గరకు వెళ్లి చూడగా అక్కడ కంచె విరగొట్టబడి ఉందని, అందులో ఉన్న రెండు సీమ కోళ్లు మాత్రమే ఉన్నాయని, మిగతా 14 కోళ్లు లేవని తెలిపారు. ఈ విషయాన్ని చుట్టుపక్కల రైతులను అడిగితే తమకు తెలియదని చెప్పారని ఆయన తెలిపారు. వీటి విలువ సుమారు రూ.12వేల వరకు ఉంటుందన్నారు. ఈ విషయం మహమ్మదాబాద్ పోలీసుకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

చెరువులో పడి మహిళ మృతి

మహ్మదాబాబాద్, జూలై 26 : చెరువులో పడి మహిళ మృతి చెందిన ఘటన మహమ్మదాబాద్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రం శివారులో గల తిప్పరేణి కుంట చెరువులో కావలి వెంకటమ్మ ప్రమాద వశాత్తు మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలు కొస్గికి చెందిన మహిళగా గుర్తించారు. మృతిరాలి కుమారుడు కావలి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు .

ఉపాధి హామీ కార్యాలయంలో అగ్ని ప్రమాదం

తెలకపల్లి, జూలై 26 : నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల కేంద్రంలోని గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయంలో అగ్ని ప్రమాదం సంభవించిన సంఘటన శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ బి.నరేష్ అందించిన వివరాల ప్రకారం... మండల కేంద్రంలోని మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ కార్యాలయంలో అగ్ని ప్రమాదం సంభవించి ఉపాధి హామీకి సంబంధించిన విలువైన ఫైల్స్, ఎంబీలు, మస్టర్లు, తీర్మానాలు సంబంధిత పత్రాలు ఫర్నీచర్ దగ్ధమయ్యాయి. శుక్రవారం ఉదయం కార్యాలయాన్ని శుభ్రపర్చడానికి వెళ్లిన అటెండర్ కొమ్ము మల్లేష్ గమనించి సంబంధిత మండల అధికారులకు తెలపడంతో వెంటనే డీఆర్‌డీవో చిన్న ఓబులేష్, ఎంపీడీవో కృష్ణయ్యలు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఎంపీడీవో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఎంపీడీవో కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ బి.నరేష్ తెలిపారు.

వంకేశ్వరంలో డీపీవో విచారణ

అమ్రాబాద్, జూలై 26 : నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలం వంకేశ్వరం గ్రామ పంచాయతీ కార్యదర్శి శేఖర్ 15వ ఆర్థిక సంఘం నిధులలో రూ. 83వేల 500లు దుర్వినియోగానికి పాల్పడినట్లు ఫిర్యాదు రావడంతో జిల్లా పంచాయతీ అధికారి కృష్ణ శుక్రవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో విచారణ జరిపారు. ఆ గ్రామ తాజా మాజీ సర్పంచ్ దశరథంనాయక్, మాజీ ఉపసర్పంచ్ చంద్రమౌళి గతంలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీపీవో వచ్చి విచారణ చేశారు. పంచాయతీ కార్యదర్శి వేసిన నిధుల దుర్వినియోగంపై సమగ్రంగా విచారణ జరిపి ఆ నిధులను రికవరీ చేసి శాఖా పరమైన చర్యలు తీసుకొంటామని డీపీవో తెలిపారు. ఆయన వెంట అచ్చంపేట డీఎల్‌పీవో వెంకటయ్య, గ్రామస్థులు న్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- కన్నీరు మున్నీరుగా విలపించిన తల్లిదండ్రులు


సాయితేజ (ఫైల్)

భూత్పూర్, జూలై 26 : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఈ సంఘటన శుక్రవారం ఉదయం భూత్పూర్ శివారులో 44వ జాతీయ రహదారిపైన చోటు చేసుకుంది. ఎస్ఐ చంద్రశేఖర్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని శేరిపల్లి(హెచ్) గ్రామానికి చెందిన ఎలుపటి రాములు, శివలీలకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు ఎలుపటి సాయితేజ(21) డిగ్రీ చదివాడు. తండ్రికి వ్యవసాయంలో చేదోడువాదోడుగా ఉంటున్నాడు. వారం రోజుల నుంచి వ్యవసాయ పనుల్లో ఉన్న సాయితేజ శుక్రవారం కూలీలను తీసుకురావడానికి జడ్చర్ల సమీపంలో ఉన్న ఆలూరు గ్రామానికి తన మోటారు సైకిల్‌పై బయలు దేరాడు. భూత్పూర్ దగ్గర సర్వీస్ రోడ్డుకు ఎదురుగా (రాంగ్‌రూట్)లో వస్తున్న బొలెరో వాహనం అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి ఎలుపటి సాయితేజ నడిపిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. సాయితేజ(21) అక్కడికక్కడే తల పగిలి దుర్మరణం చెందాడు. కుమారుడు చనిపోయాడన్న విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు సంఘటన స్థలానికి చేరుకొని కన్నీమున్నీరుగా విలపించారు. మృతుడి తండ్రి ఎలుపటి రాములు ఫిర్యాదు మేరకు బొలెరో వాహన డ్రైవర్‌పై కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్ఐ తెలిపారు.

బస్సుపై నుంచి కింద పడి మహిళ మృతి


పెంటమ్మ (ఫైల్)

గోపాల్‌పేట, జూలై 26 : వెళ్తున్న బస్సు నుంచి కింద పడి తీవ్ర గాయాలపాలైన మహిళ చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం తాడిపత్రి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి డిపోకు చెందిన బస్సు గురువారం సాయంత్రం కోడేరు నుంచి వనపర్తికి వస్తుండగా మార్గమధ్యలో చెన్నా రంలో తాడిపత్రికి చెందిన బంకల పెంటమ్మ(49) తన ఆరేళ్ల కుమారుడు శశాంక్‌తో కలిసి బస్సెక్కింది. తాడిపత్రికి వచ్చేసరికి బస్సులోని ప్రయా ణికులు దిగిపోగా ఆమె మర్చిపోయి అలాగే కూర్చున్నది. బస్సు కొంచెం ముందుకు కదలగానే ఆమె దిగాల్సిన స్టేజీ వచ్చిందంటూ పరుగున ముందుకు వచ్చి కిందకు దూకింది. గ్రహించిన కండక్టర్ ప్రయాణికురాలు పెంటమ్మ కుమారుడు శశాంక్‌ను కిందకు దూకబోగా వెనక్కి లాక్కున్నాడు. కిందకు దూకిన పెంటమ్మకు నడుము భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు వెంటనే ఆమెను 108లో వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం తలలో రక్తం గడ్డ కట్టిందని, పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు హైదరాబాద్‌కు ఉస్మానియా ఆసుపత్రికి రెఫర్ చేశారు. హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో శుక్రవారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో మృతి చెందింది. మృతురాలి భర్త బంకల దేవన్న ఫిర్యాదు మేరకు అజాగ్రతతో బస్సు నడిపిన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరిప్రసాద్ తెలిపారు.

ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా: వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 26 : ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి యువ రైతు సింగారపు స్వామి(33) మృతి చెందినట్లు శ్రీపూర్ గ్రామస్థులు శుక్రవారం తెలిపారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మండలంలోని శ్రీపూర్ గ్రామానికి చెందిన సింగారపు స్వామి తన వ్యవసాయ పొలంలో ట్రాక్టర్‌తో కరిగెట చేస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడింది. స్వామి ట్రాక్టర్ నడుపుతుండడంతో ట్రాక్టర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

అదుపు తప్పి డీసీఎం బోల్తా

రాజాపూర్, జూలై 26 : మండలంలోని ముదిరెడ్డిపల్లి సమీపంలోని పోలేపల్లి సేజ్ వద్ద జాతీయ రహదారి 44 పక్కన శుక్రవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు అదుపు తప్పి డీసీఎం వాహనం బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... జడ్చర్ల వైపు నుంచి హైదరాబాద్ టమాట లోడ్‌తో వెళ్తున్న డీసీఎం ముందు టైర్లు ఒక్కసారి బ్లాస్ట్ కావడంతో రోడ్డు పక్కన గుంతలోకి దూసుకుపోయి పడిపోయింది. డ్రైవర్‌కు గానీ, ఇతరులకు ఎలాంటి ప్రాణహాని జరగలేదు. ఈ సంఘటనపై ఎస్ఐ కే.రవిని వివరాలు అడగగా, ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన వివరాలు అడిగి తెలుసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

కార్గిల్ యుద్ధవీరుల త్యాగాలను మరవొద్దు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి



యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులను సత్కరిస్తున్న బీజేపీ, బీజేవైఎం నాయకులు

జడ్చర్ల/ మిడ్జిల్, జూలై 26 : కార్గిల్ యుద్ధవీరుల త్యాగాలను మరవద్దని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేష్ అన్నారు. జడ్చర్ల పట్టణంలోని మాధవీయం భవనంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దేశం కోసం, దేశప్రజల కోసం సరిహద్దులో సైనికులు పని చేస్తున్నారని, వారికి సెల్యూట్ అని అన్నారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో అమరులైన అమరవీరులను స్మరించుకున్నారు. కార్గిల్‌లో శత్రుదేశంతో పోరాడి విజయాన్ని అందించిన భారత సైనికులకు శాలువాలతో సత్కరించారు. మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళా శాల నుంచి ఎన్‌సీసీ విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు రాజేశ్వర్, బుచ్చిరెడ్డి, సుబ్రహ్మణ్యం, సాహితిరెడ్డి, కొంగళి శ్రీకాంత్, నాగరాజు, శ్రీనాథ్, నరేందర్, వెంకట్, పల్లె తిరుపతి, పిట్టల నరేశ్, బీఎస్ఎఫ్ జవాన్‌లు చెరుకుల రాజు, సత్యనారాయణ, బాలకృష్ణ, చెన్నయ్య, కొండయ్య, సయ్యద్‌అలీ పాల్గొన్నారు.

● కార్గిల్ విజయ్‌దివస్‌లో భాగంగా మిడ్జిల్‌లో ఏబీవీపీ పాలమూరు జిల్లా కన్వీనర్ సతీష్ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పాకిస్తాన్ సైన్యాన్ని తరిమికొడుతూ కార్గిల్‌లో భారతదేశ విజయపతాకాన్ని ఎగురవేసిన దినం జూలై 26వ తేది అని, అందుకే కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఏబీవీపీ ఎస్ఎఫ్‌డీ జిల్లా కన్వీనర్ శేఖర్, నాయకులు శివ, పవన్, నవీన్, దీపు, శ్రీను, అరుణ్, సాయి ఉన్నారు.

జేపీఎన్‌సీఈలో కార్గిల్ విజయ్ దివస్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 26 : జిల్లా కేంద్రంలోని జేపీఎన్‌సీఈ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థులు శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కళాశాలలో వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అంతకుముందు కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఎన్‌సీసీ అధికారి డాక్టర్ గురు రాఘవేంద్రారెడ్డి మాట్లాడుతూ కార్గిల్ విజయం కోసం అమరులు అయిన సైనికులను ప్రతీ భారతీయుడు స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సాయికృష్ణ, పార్థసారది, రవీందర్, షానవాజ్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఈత మొక్కల పెంపకానికి ప్రోత్సాహం

కోయిలకొండ, జూలై 26 : గ్రామాల్లో ఈత మొక్కల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని ఎంపీడీవో కాళప్ప తెలిపారు. శుక్రవారం మండలంలోని గార్లపాడ్‌లో గీత కార్మికులు గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ఈత మొక్కలు నాటి మాట్లాడారు. ఉపాధి హామీ ద్వారా గీత కార్మికులకు ఉచితంగా ఈత మొక్కలు అందిస్తున్నదని, వాటిని సంరక్షిచాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో నసీర్ అహ్మద్, ఏపీవో నర్సయ్య, మాజీ సర్పంచ్‌లు అంజనేయులు, దస్తగిరి, శ్రీహరిగౌడ్, మాజీ ఎంపీటీసీ విజయలక్ష్మి, నాయకులు శ్రీపాదరావు, మల్లేష్‌గౌడ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాలు



మునిమోక్షంలో బోనాలతో మహిళలు, పాల్గొన్న గ్రామ పెద్దలు

హన్వాడ, జూలై 26 : మండలంలోని మునిమోక్షం, బుద్దారం గ్రామాలలో శుక్రవారం అషాఢమాస బోనాల పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాలలో మహిళలు బోనాలను పసుపు, కుంకుమ, వేప కొమ్మలతో అలంకరించారు. ఊరేగింపుగా వెళ్లి బొడ్రాయి చుట్టూ తిరిగి పోచమ్మ తల్లి దేవాలయానికి చేరుకున్నారు. నైవేద్యాన్ని సమర్పించారు. గ్రామ పెద్దలు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

● మహమ్మదాబాద్ : మండల వ్యాప్తంగా పలుగ్రామాల్లో పోచమ్మ, ఎల్లమ్మ బోనాల వేడుకల ఘనంగా నిర్వహించారు. మహమ్మదాబాద్‌లోని ఎల్లమ్మదేవాలయంలో భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించారు. గాధిర్యాల్ గ్రామంలో పోచమ్మతల్లికి బోనాలు సమర్పించారు. కోడిపుంజులు, మేక పోతులను అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

గాయత్రీ మహాయజ్ఞం కరపత్రాల ఆవిష్కరణ

జడ్చర్ల, జూలై 26 : వచ్చే నెల 9, 10, 11 తేదీలలో శ్రావణి త్రిదివసీయ యజుర్వేద గాయత్రీ మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ సంగీత, నాటక అకాడమీ మాజీ ఛైర్మన్, ఆర్యా ప్రతినిధి సభ ఉపాధ్యక్షుడు బాద్మి శివకుమార్ తెలిపారు. శివకుమార్ జడ్చర్లలోని తన స్వగృహంలో మహాయజ్ఞం కరపత్రాలను ఆర్యసమాజ్ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఆర్యసమాజ్ సభ్యులు గుబ్బ నర్సిములు, బొడ్ల విజయ్‌కుమార్, బక్క రాజేశ్వర్, ద్యాసమోని కృష్ణయ్య, సంజీవ్, చెరుకుల రాజు, మిర్యాల రామకృష్ణ, అయ్యన్న పాల్గొన్నారు.

అవకాశాలను వినియోగించుకోవాలి

- పీయూ రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి

పాలమూరు యూనివర్సిటీ, జూలై 26 : విద్యార్థులు వచ్చిన అవకాశాలను వినియోగించుకోవాలని పీయూ రిజిస్ట్రార్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం పీయూ పీజీ సెమినార్ హాల్‌లో జరిగిన పీజీ గణిత శాస్త్రం విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. విద్యార్థులు ఏదైనా అవకాశం వస్తే వెళ్లాలని సూచించారు. గణిత శాస్త్ర విద్యార్థులకు ఉజ్వల భవిషత్తు ఉందని, నైపుణ్యం ఉన్న విద్యార్థులు ఏ రంగంలోనైనా రాణిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణయ్య, గణిత శాస్త్రం విభాగాధిపతి డాక్టర్ రవీందర్‌రెడ్డి, అధ్యాపకులు నాగరాజు, మధు, సురేష్ గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

గతుకుల రోడ్డుకు మరమ్మతు



రోడ్డును మరమ్మతు చేయిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

భూత్పూర్, జూలై 26 : నాగర్ కర్నూల్‌కు వెళ్లే రోడ్డు, మునిసి పాలిటీలోని గోప్లాపూర్ నుంచి భూత్పూర్ పట్టణం వరకు సుమారు కిలోమీటర్ దూరాన రోడ్డు మొత్తం భారీ గుంతల మయమై వాహన దారులకు తీవ్ర ఇబ్బందులను కల్గిస్తున్నది. ఈ విషయాన్ని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసు కెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన గుంతలమయమైన రోడ్డును తాత్కాలిక మరమ్మతులు చేయించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడికి సూచించారు. శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం గోప్లాపూర్ నుంచి భూత్పూర్ శివాలయం వరకు డస్టు మట్టితో గుంతలను పూడ్చివేయించారు. యువజన కాంగ్రెస్ విభాగం మండల అధ్యక్షుడు భూపతిరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ మాసగౌడ్, నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, శ్రీశైలం, కప్పెట కిట్టప్ప పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

మిడ్జిల్, జూలై 26 : ఉపాధ్యాయుల పెండింగ్‌లో ఉన్న డీఏలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్. నర్సింములు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.వెంకటయ్య కె. రమేష్‌లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. పలువురు ఉపాధ్యాయులకు సంఘం సభ్యత్వాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎస్‌జీటీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవింగ్‌చేసి కొత్త ప్లేస్‌లకు పంపించి, పీఎస్ హెచ్‌ఎంలుగా ప్రమోషన్స్ కల్పించాలని కోరారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్స్‌గా ప్రమోషన్స్ ప్రభుత్వం కల్పించాలని కోరారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను ప్రభుత్వం కల్పించడంపై వారు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు లక్ష్మయ్య, జానకమ్మ ఉన్నారు.

వాసవీమాత ఆలయంలో పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న ఆర్యవైశ్యులు

దేవరకద్ర, జూలై 26 : మండల కేంద్రంలోని వెలిసిన వాసవీమాత ఆలయంలో ఆషామాడం మాసం సందర్భంగా పట్టణ ఆర్యవైశ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారు శాకాంబరిదేవిగా ప్రజలకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్యులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

కుక్కలు, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

మహబూబ్‌నగర్, జూలై 26 : పాలమూరు పురపాలిక పరిధిలో ముఖ్యంగా 37వ వార్డు సద్దలగుండులో కుక్కలు, దోమల బెడద ఎక్కువగా ఉందని వీటిపై చర్యలు తీసుకోవాలని సద్దలగుండుకు చెందిన అల్తాఫ్ హుస్సేన్ శుక్రవారం పాలమూరు పురపాలిక కమిషనర్ మహేశ్వర్‌రెడ్డికి లిఖితపూర్వక ఫిర్యాదుచేశారు. కుక్కలు ఎక్కువగా ఉన్నాయని, రోడ్లపై గుంపులుగా తిరగడం వల్ల ఆ ప్రాంతంలో నివాసం ఉండే ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, స్కూల్‌కు వెళ్ళే విద్యార్థులు భయ పడుతున్నారన్నారు. వీటిని నియంత్రించాలని, అదేవిధంగా దోమల వల్ల మలేరియా, డెంగీ వంటి రోగాలు వస్తున్నాయన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని, శానిటేషన్ చేయించాలని కోరారు.

ఎన్మాళ్లీ వన్‌వే ఇక్కట్లు

- ఆందోళన చెందుతున్న స్థానిక ప్రజలు
- తాగునీటి పైపులైన్ షిఫ్టింగ్‌తో నిలిచిన రోడ్డు పనులు
- పూర్తికాని భూత్పూర్ - చించోల్లి రోడ్డు పనులు



అమిస్తాపూర్ దగ్గర రోడ్డును తవ్వి పెట్టిన దృశ్యం

భూత్పూర్, జూలై 26 : భూత్పూర్ నుంచి చించోలి వరకు 103 కిలో మీటర్ల మేర జాతీయ రహదారి 167ఎ డబుల్ లైన్ రోడ్డును నిర్మిస్తున్నారు. దీనికిగాను 60 కిలోమీటర్ వరకు మొదటి ప్యాకేజీ కింద రూ.330 కోట్ల నిధులు మంజూరు చేశారు. అదే విధంగా రెండవ ప్యాకేజీ కింద 43 కిలోమీటర్ వరకు రూ.340 కోట్ల నిధులతో పనులు ప్రారంభించారు. రెండేళ్ల క్రితం ప్రారంభించిన ఈ పనులు నత్తనడకన సాగుతుండడంతో వాహనదారులు, ప్రయాణికులు, ఆయా గ్రామాల ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. భూత్పూర్ మునిసిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్ దగ్గర సాక్షి గణపతి దేవాలయం నుంచి గ్రామ చివరి వరకు సుమారు కిలో మీటర్ వరకు భూత్పూర్-పాలమూరుకు వెళ్లే రోడ్డును విస్తరణ కోసం తవ్వి వదిలివేశారు. ఈ రోడ్డు మధ్యలో మిషన్ భగీరథ తాగునీటి పైపులైన్ ఉండడంతో పైపులైన్ తీసి మళ్లీ కొత్తగా ఏర్పాటు చేయడానికి చాలా సమయం పడుతున్నట్లుగా అధికారులు తెలిపారు. ఈ మిషన్ భగీరథ మంచి నీటి పైపు లైన్ భూత్పూర్ మీదుగా మన్యంకొండ దేవస్థానం వద్ద ఏర్పాటు చేసి స్టోరేజీకి వెళుతోంది. ఒక వేళరోడ్డు పనులు చేస్తుంటే పొరపాటున పైపులైన్ డ్యామేజీ అయితే జిల్లాలోని అన్ని గ్రామాలకు చాలా కాలం వరకు తాగునీటి సరఫరా ఆగిపోయే అవకాశం ఉండడంతో అధికారులు రోడ్డు పనులకు నిలిపివేశారు. దీంతో అమిస్తాపూర్ గ్రామంలో వన్‌వే ట్రాఫిక్ ఉండడంతో వాహనాల రద్దీతో దుమ్మును భరించలేకపోతున్నామని భూత్పూర్, అమిస్తాపూర్ గ్రామాల ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అమిస్తాపూర్ గ్రామం మధ్యలో ఈ వన్‌వే ట్రాఫిక్ ఏర్పడడంతో ప్రతీనిత్యం వందలాది వాహనాలు వెళుతుంటాయి. దీని వల్ల వాహనాల నుంచి వెలువడే కాలుష్యం, దుమ్ము, ఇళ్లలో చేరి పిల్లలు, వృద్ధులు అనారోగ్యం పాలవుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనాల రాకపోకల రద్దీ విపరీతంగా ఉండడంతో పలుమార్లు ప్రమాదాలు జరిగాయని అంటున్నారు. ఈ విషయంలో జాతీయ రహదారి విస్తరణ ప్రత్యేక అధికారి రమేష్‌ను వివరణ కోరగా మిషన్ భగీరథ పైపులైన్ మార్చడంలో సమయం పడుతున్నదని, అందువల్ల రోడ్డు విస్తరణ పనులు ఆలస్యం అవుతున్నాయని అన్నారు. పైపులైన్ మార్చడం అయిపోతే వన్‌వే రోడ్డు కాకుండా డబుల్ లైన్ రోడ్డును సాధ్యమైనంత త్వరగా ప్రారంభిస్తామని ఆయన వివరించారు.



అమిస్తాపూర్ దగ్గర ఏర్పాటు చేసిన వన్‌వే రోడ్డు

డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించండి

-ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి ట్రాన్స్‌జెండర్ల వినతి



ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న ట్రాన్స్‌జెండర్లు

మహబూబ్‌నగర్, జూలై 26 : డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించడంతో పాటు తమ సమస్యలను పరిష్కరించాలని ట్రాన్స్‌జెండర్లు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. శుక్రవారం ఎమ్మెల్యేను క్యాంప్ కార్యాలయంలో పట్టణ ట్రాన్స్‌జెండర్లు కలిసి వినతిపత్రం అందజేశారు. చాలాఏళ్ళగా ఇక్కడ ఉంటున్న తమకు నివాసాలు లేవని తెలిపారు. ట్రాన్స్‌జెండర్లు ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్లు ప్రీతి, అఖిల, వెన్నల, గీత పాల్గొన్నారు.

● 21 మందికి కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ : కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా ఎంపికైన 21 మంది లబ్ధిదారులకు క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. తహసీల్దార్‌లు సుందర్‌రాజ్, నయాబ్, శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు సిరాజ్‌ఖాద్రి, మల్లు నర్సింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, సీజె బెనహర్, శ్రీనివాస్, రాజుగౌడ్, గోపాల్ పాల్గొన్నారు.

3, 8, 15వ వార్డులలో పర్యటించిన ఎమ్మెల్యే

పాలమూరు పురపాలికను ఆదర్శ మునిసిపాలిటీగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మునిసిపల్ ఛైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్‌తో కలిసి పురపాలిక పరిధిలోని 3, 8, 15వ వార్డులలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. కోయిలకొండ ఎక్స్‌రోడ్‌లో రూ.10 లక్షలతో నిర్మించే సీసీరోడ్డు పనులు, 8వ వార్డులో సీసీరోడ్డు నిర్మాణ పనులు, 3వ వార్డులోని హౌసింగ్‌బోర్డు కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. అప్పన్నపల్లిలో బస్టాప్ ఏర్పాటు చేయించాలని కోరగా వెంటనే ప్రతిపాదనలు తయారుచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, కౌన్సిలర్లు రామాంజనేయులు, లతాశ్రీ, నీరజవిఠల్‌రెడ్డి, నాయకులు సిరాజ్‌ఖాద్రి. లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు ప్రాజెక్టులకు బడ్జెట్‌లో పెద్దపీట

- టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్‌అక్తర్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు జహీర్‌అక్తర్

మహబూబ్‌నగర్, జూలై 26 : ఉమ్మడి పాలమూరు ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ఇందుకు బడ్జెట్‌లో కేటాయించిన నిధులే నిదర్శనమని టీపీసీసీ అధికారప్రతినిధి జహీర్‌అక్తర్ అన్నారు. తెలంగాణ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ వాస్తవాలకు దగ్గరగా ఉందన్నారు. గతంలో బీఆర్ఎస్ పాలనలో బడ్జెట్ అంటే అంకెల గారడీగా ఉండేదని, ఇప్పుడు అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అత్యుత్తమ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు సీజె బెనహర్, లింగంనాయక్, ఫయాజ్ పాల్గొన్నారు.

వచ్చే నెలలో జాతీయ బృందగాన పోటీలు

మహబూబ్‌నగర్ టౌన్, జూలై 26 : ఆగస్టు నెల చివరి నాటికి ఏబీవీపీ ఆధ్వర్యంలో జాతీయ బృందగాన పోటీలు నిర్వహించనున్నట్లు భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర సలహాదారు పాండురంగం తెలిపారు. శుక్రవారం పట్టణంలోని భారత్ వికాస్ పరిషత్ కార్యాలయంలో ఏబీవీపీ ఎగ్జిక్యూటివ్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర సలహాదారు పాండురంగం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బృందగాన పోటీలో 6 నుండి 10 వతరగతి విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొనవచ్చునని తెలిపారు. సమావేశం కార్యదర్శి రమేష్ చందర్, ప్రతినిధులు వెంకటేశ్వరగుప్త, చంద్రుడు, రాంచందర్, నారాయణ్‌గౌడ్, యతిరాజాచారి, సహదేవ్ పాల్గొన్నారు.

కావేరమ్మపేటలో డ్రై డే కార్యక్రమం

జడ్చర్ల, జూలై 26 : జడ్చర్ల అర్బన్ హెల్త్‌సెంటర్ పరిధిలోని కావేరమ్మపేటలో శుక్రవారం నిర్వహించిన డ్రై డే కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ భాస్కర్‌నాయక్ పరిశీలించారు. ఇళ్ల పరిసరాలు, ఇళ్లల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని అన్నారు. అనంతరం అర్బన్ పీహెచ్‌సీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అర్బన్‌హెల్త్‌సెంటర్ అధికారి డాక్టర్ మనుప్రియ, డాక్టర్ సుదీప్, వార్డు అధికారులు, ఆశ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న మహబ్బత్ అలీషా దర్గా ఉర్సు

జడ్చర్ల, జూలై 26 : జడ్చర్ల పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీలోని మహబ్బత్ అలీషా దర్గా ఉర్సు ఉత్సవాలు శుక్రవారం కొనసాగాయి. దర్గాను దర్శించుకుని భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉర్సు ఉత్సవాలలో భాగంగా దర్గాలో కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధికార ప్రతినిధి దుష్యంత్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఎస్ఐ శివనాగేశ్వర్ నాయుడు

మిడ్జిల్, జూలై 26 : విద్యార్థులందరికీ ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండి మన చుట్టూ ఉన్నవారిని అప్రమత్తం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు అన్నారు. ఎస్పీ జానకి ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీలో పోలీస్ కళాబృందం, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం వారి సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు సామాజిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ తక్కువ ధరలకే పెద్ద మొత్తంలో వస్తువులు దొరుకుతాయని నమ్మించే వారి మాటలు నమ్మవద్దని సూచించారు. ఎవరైనా గంజాయి, మాదక ద్రవ్యాలు రవాణా, విక్రయాలు చేపడితే వెంటనే జిల్లా పోలీస్ కంట్రోల్ రూం నెంబర్, 8712659360కు ఫోన్ చేసి సమాచారం అందజేయాలన్నారు. బాల్య వివాహాల వలన అనేక అనార్థలు జరుగుతాయని ఎవరైన బాల్యవివాహాలకు పాల్పడితే చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్1098కు కాల్ చేసి సమాచారం అందజేయాలని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కళాబృందం సభ్యులు రాములు, జగదీష్, శ్రీనివాసులు, శివరాములు, ఏ.హెచ్.టి.యు సభ్యుడు వరప్రసాద్, కేజీబీవీ ఎస్ఓ కవిత ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలి

- కలెక్టర్ విజయేందిర బోయి



అడ్డాకుల మండల సమాఖ్య సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

అడ్డాకుల, జూలై 26 : మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మహిళలు నైపుణ్యతను పెంచుకొని ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శుక్రవారం అడ్డాకుల మండల సమాఖ్య ఆధ్వర్యంలో మండల సమావేశ మందిరంలో నిర్వహించిన ఈసీ సమావేశంలో ఆమె మహిళలతో మాట్లాడారు. మండలంలో టార్గెట్‌కు మించి మహిళాశక్తిలో డెయిరీ, కోళ్ల ఫామ్స్, మిర్చి యూనిట్స్‌కు బ్యాంకులు, స్త్రీనిధి ద్వారా రుణాలు ఇస్తామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలకు ఛైర్మన్‌లుగా ఉన్న ఓ అధ్యక్షురాలు పాఠశాలకు వెళ్లి డ్రాపౌట్ పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. మహిళా సమాఖ్య భవనం దగ్గర డీఆర్‌డీవో పీడీ నర్సింహులు మొక్కలు నాటారు. అంతకు ముందు మూసాపేట మండల కేంద్రానికి సమీపంలోని గుట్టపై వెలిసిన పురాతన రామలింగేశ్వరా లయంలో కలెక్టర్ పూజలు నిర్వహించారు. అనంతరం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ కోసం ప్రభుత్వ భూముల కోసం స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ మదన్‌మోహన్‌గౌడ్, ఏపీఎం సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులను గడువులోగా మంజూరు చేయాలి

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), జూలై 26 : జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తూ టి.జి.ఐపాస్ ద్వారా పరిశ్రమల స్థాపనకు వివిధ శాఖల నుండి మంజూరు చేయాల్సిన అనుమతులను నిబంధనల మేరకు నిర్దేశిత గడువులోగా మంజూరు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశానికి హాజరైన కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో టిజి ఐపాస్ ద్వారా 12 పరిశ్రమలకు వివిధ శాఖల ద్వారా మంజూరు చేయాల్సిన అనుమతులు గడువులోగా జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ బాబురావు, గనులు, భూగర్భ శాఖ సహాయ సంచాలకులు సంజయ్, ఎల్‌డిఎం భాస్కర్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి చత్రునాయక్, కార్మిక శాఖ సహాయ కమిషనర్ స్వామి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సీడీపీవోలు, సూపర్‌వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తక్కువ బరువు గల పిల్లలను గుర్తించి అటువంటి పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికా జరీనా బేగం, తదితరులు పాల్గొన్నారు.


కురుమూర్తి ఆలయ అభివృద్ధి గురించి సీఎం దృష్టికి తీసుకెళ్తా

- ఘాట్‌రోడ్డు కోసం పరిశీలించిన ఎమ్మెల్యే, సీఎన్‌సీ, అధికారులు

చిన్నచింతకుంట, జూలై 26 : కురుమూర్తి వేంకటేశ్వరస్వామి అభివృద్ధి గురించి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆర్‌అండ్‌బీ సీఈ మోహన్‌నాయక్, ఎస్ఈ నర్సింగం, డీఈ నరేందర్, ఈఈ దేశ్యా నాయక్, ఏఈ శ్రీరాంలతో కలిసి, కురుమూర్తిస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. ఆలయాన్ని ఎంతో అభివృద్ధి చేసేందుకు చాలా అవకాశాలున్నాయని సీఈ తమకు వివరించారని తెలిపారు. ముందు, వెనుక భాగం రెండు వైపులా రోడ్డు సౌకర్యం ఉండేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారని వివరించారు. అలాగే మండల కేంద్రంలో సమీపంలోని ఊకచెట్టువాగులో నిర్మించిన చెక్‌డ్యాంలో నీరు నిలువ ఉండటం కారణంగా చిన్నచింతకుంట గ్రామ ప్రజలకు తాగునీరు పూర్తిగా కలుషితమై, గతంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ప్రజలకు మేలు చేసే ప్రయత్నంలో భాగంగానే చెక్‌డ్యాం నీరు నిలువకండా చూడాలని సంబంధిత అధికారులకు చూపించామని, వారు కూడా సానుకూలంగా స్పందించారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధనార్జనే ధ్యేయంగా ఇసుక దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. అంతకుముందు కురుమూర్తి ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు, అధికారులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఘాట్‌రోడ్డు నిర్మాణ స్థలాలను అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ సురేందర్‌రెడ్డి, నాయకులు వట్టెం శివకుమార్, కురుమూర్తి ఆలయ మాజీ ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి, నాయకులు ప్రదీప్‌రెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, శేఖర్, వెంకటేష్, జయరాజు, ప్రతాప్ పాల్గొన్నారు.

మీరిచ్చిన హామీలు అమలు చేయండి

- కాంగ్రెస్ నాయకులకు హితవు పలికిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్‌నగర్(క్లాక్‌టవర్), జూలై 26 : ఎంత సేపూ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించడం కాదని, ముందుగా రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను ప్రభుత్వపరంగా అమలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మునిసిపల్ మాజీ వైస్ ఛైర్మన్ కె. రాములుతో కలిసి మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ఎలాంటి కేటాయింపులు జరుగలేదని కాంగ్రెస్ నాయకులు అవగాహన రహితంగా మాట్లాడుతూ అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ డీకే అరుణ ఇచ్చిన హామీలను తప్పనిసరిగా నెరవేరుస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు వాగ్దానాలు చేసి ఇప్పటి వరకు ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. రాజీనామా చేయాల్సివస్తే ఎంపీ అరుణ కాదని, ముందుగా సీఎం రేవంత్‌రెడ్డి చేయాల్సి వస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం సహాయంతోనే రాష్ట్ర అభివృద్ధి చెందుతుందని ఇటీవల జడ్చర్లలో అంతర్గత రోడ్ల నిర్మాణ శంకుస్థాపనలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్న మాటలను ఆయన గుర్తు చేశారు. ఎప్పుడు చూసినా కేంద్రం రాష్ట్రానికి ఏమిచ్చింది గాడిద గుడ్డు అని పదేపదే సీఎం రేవంత్ రెడ్డి అనడం చాలా విచారకరమని వాపోయారు. సమావేశంలో సీనియర్ నాయకులు బురుజు రాజేందర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, అచ్చుగట్ల అంజయ్య, రమేష్ కుమార్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యాదయ్య, మీడియా ఇన్‌చార్జి సతీష్ కుమార్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

మహమ్మదాబాద్, జూలై 26 : ప్రతీ ఒక్కరు తమ చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లేకుంటే వ్యాధులు సోకే ప్రమాదం ఉందని అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మహమ్మదాబాద్ నుంచి రాఘవపల్లి వెళ్లే రోడ్డును ఆయన పరిశీలించారు. అనంతరం అముదాలగడ్డతండా పాఠశాలను, అదే గ్రామ పంచాయతీ పరిధిలోని బొట్లగడ్డతండా పాఠశాలను పరిశీలించారు. అక్కడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్మీడియట్ స్పాట్ అడ్మిషన్స్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం జూలై 25 : తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో మిగిలిన ఇంటర్మీడియట్ సీట్ల కోసం శుక్రవారం జిల్లా కేంద్రంలోని రాంరెడ్డి గూడ గురుకుల పాఠశాలలో స్పాట్ అడ్మిషన్స్ కోసం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ అధికారి ఫ్లోరెన్స్ రాణి దగ్గరుండి పర్యవేక్షించారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని బాలికలు ఈ స్పాట్ అడ్మిషన్లకు హాజరయ్యారు. మెరిట్ ఆధారంగా ఎంపీసీ, బైపీపీ, సీఈసీ, ఎంఈసీ, వృత్తి విద్యాకోర్సులలో 202 మంది విద్యార్థినులకు అడ్మిషన్స్ కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల, నారాయణ పేట జిల్లాకు చెందిన గురుకుల కళాశాల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

ఆరోగ్యమిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), జూలై 25 : ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆరోగ్యమిత్ర ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గిరిప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం జనరల్ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన ఆరోగ్యమిత్రల జిల్లా స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకానికి మూల స్తంభాలుగా పనిచేస్తూ ప్రజలకు చేరువయ్యామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యమిత్ర ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ సెక్రటరి మురళి, ప్రదీప్, నాయకులు సంజీవ, ప్రదీప్‌కుమార్, ఆంజనేయులు, సరిత, కృష్ణవేణి, తిరుపతమ్మ పాల్గొన్నారు.

త్వరలో స్టేడియంలో సీసీ కెమెరాల ఏర్పాటు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 26 : స్టేడియం నిఘా కరువు.. ఈ నెల 22న ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. కలెక్టర్ జిల్లా క్రీడాశాఖ అధికారి వివరణ కోరినట్లు జిల్లా క్రీడాధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు సీసీ కెమారాల ఏర్పాటు అనుమతి తీసుకున్నామని, త్వరలో మైదానం మొత్తం కవరయ్యేలా సీసీ కెమారాలు బిగిస్తామని తెలిపారు. విలువైన సామగ్రి ఉందని, చోరీ జరిగితే గుర్తించడానికి ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు. ఉదయం, సాయంత్రం మాత్రమే ఆటలు ఆడుకునేందుకు, వాకింగ్‌కు అనుమతిస్తామని, ఇతర వేళల్లో ఎవరినీ అనుమతించబోమని తెలిపారు.